నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 | RANGAREDDY



కేసీఆర్‌నగర్ నుంచే..

మూసీ సర్వే మొదలైన నేపథ్యంలో రామంతాపూర్ దగ్గర ఉన్న కేసీఆర్ నగర్ వద్దకు అధికారులు వచ్చారు. మొత్తం 260 ఇండ్లకు మార్కింగ్ చేసే క్రమంలో తమకు పట్టాలు, పాస్‌బుక్‌లు, రిజిస్ట్రేషన్స్ అన్నీ ఉన్నా మార్కింగ్ చేయడమేమిటంటూ.. స్థానికులు అధికారులను ప్రశ్నించారు. మరోవైపు మూసీ పరీవాహక ప్రాంతాల్లో మార్కింగ్ ప్రక్రియ కొనసాగుతుండగానే కేసీఆర్ నగర్ నుంచే కూల్చివేతల పర్వం మొదలవుతుందంటూ ప్రచారం జరుగుతున్నది. దీంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 2004 నుంచి ఇక్కడ ఉంటున్నామని, 'చావనైనా చస్తాం' కానీ ఈ ప్రాంతాన్ని వదిలిపెట్టేది లేదంటూ నిర్వాసితులు తేల్చి చెప్పారు.

మార్కింగ్ ఎక్కడంటే..

చాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్‌నగర్‌ల్లో మూసీ నది బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలు, బహదూర్‌పురా, కిషన్‌బాగ్, అసద్‌బాబానగర్ తదితర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు పోలీసుల సహాయంతో మార్కింగ్ చేశారు. లంగర్‌హౌజ్ ఆశ్రంనగర్‌లో మార్కింగ్ ప్రక్రియను స్థానికులు అడ్డుకున్నారు. కష్టపడి కట్టుకున్న ఇండ్లను కూల్చేయడమంటే తమ బతుకులతో ఆడుకోవడమే అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో ఇంట్లో తాము మూడు, నాలుగు కుటుంబాలుగా కలిసి ఉంటున్నామని ఒక్క డబుల్ బెడ్రూం ఇండ్లలో తమ కుటుంబాలన్నీ ఎలా ఉండగలవని ఆవేదన వ్యక్తం చేశారు. చైతన్యపురి ఫణిగిరికాలనీ, న్యూమారుతీనగర్, సత్యనగర్‌ల్లో అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమకు విషం ఇచ్చి తమ ఇండ్లకు మార్కింగ్ చేసి తొలగించండంటూ ఆందోళన చేశారు. ఇంటి వివరాలు, యజమానుల వివరాలు నమోదు చేసే పత్రాలను కొందరు స్థానికులు ఆగ్రహంతో చించేశారు. మార్కింగ్ చేసేందుకు ఉపయోగించే ఎరుపు రంగును ఓ యువకుడు లాక్కొని దూరంగా విసిరేశాడు.

చైతన్యపురి కొత్తపేటలో పోలీసులతో స్థానికుల వాగ్వాదం

పురానాపూల్‌లో ఓ ఇంటికి ఆర్‌బీఎక్స్ మార్కింగ్ వేస్తున్న అధికారులు

నిరసనలు కొనసాగుతుండగానే..

ఒకవైపు స్థానికుల నిరసనలు కొనసాగుతుండగానే మూసీ పరీవాహక ప్రాంతాలోని ఇండ్లకు అధికారులు మార్కింగ్ చేశారు. అయితే సర్వే అధికారులను అడ్డుకునేందుకు స్థానికులు ప్రయత్నించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. కొందరు మహిళలు ఏడుస్తూ మహిళా కానిస్టేబుళ్లకు దండం పెడుతూ తమ ఇండ్ల జోలికి రావద్దంటూ వేడుకున్నారు. అయినా అధికారులు వినకపోవడంతో స్థానికులు సర్వేను అడ్డుకున్నారు. చైతన్యపురి, చాదర్‌ఘాట్ తదితర ప్రాంతాల్లో అధికారులను నిలదీసిన ప్రజలు సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ ఇంట్లో ఉంటామంటూ..నిరసన తెలిపారు.

మిన్నంటిన రోదనలు..

రేవంత్‌కు శాపనార్థాలు

- మేము ఓట్లేసి గెలిపించింది మా ఇండ్లు కూలగొట్టించుకోడానికేనా.. చైతన్యపురిలో ఓ యువతి ఆక్రోశం..
- మాకు విషమిచ్చి చంపి.. మూసీలో పడేసి తమ ఇండ్లను కూలగొట్టండి.. కేసీఆర్ నగర్‌లో ఓ మహిళ ఆగ్రహం..
- ప్రభుత్వాన్ని మంచిగా నడుపుకోమంటే మా జీవితాలనే కూల్చేయాలనుకున్నోని కుటుంబం బాగుంటదా..నాశనమైపోతది.. మా ఉసురు తగలకుండా పోతడా.. ఓ వృద్ధురాలి శాపనార్థాలు..
- ఇప్పటివరకు ఇక్కడికి మూసీ నీళ్లే రాలే.. ఇదెట్ల ఎఫ్‌టీఎల్ అయితది.. లోన్లు తీసుకున్నం.. ఇంకా ఆ బాకే తీరలే.. ఇప్పడొచ్చి ఇండ్లు కూలగొడ్తమంటే ఎట్ల... ఇది వెంకటసాయినగర్ కాలనీ వాసుల ప్రశ్న. మూసీ పరీవాహక ప్రాంతంలో సర్వే చేపట్టిన కాలనీల్లో స్థానికుల ఆవేదన ఇది. ఓట్లేసి గెలిపిస్తే తమ గూడే చెదిరేలా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరుపై వెల్లువెత్తిన ప్రజాగ్రహమిది. ఎన్నో ఏండ్లుగా నివాసముంటున్న తమ ఇండ్లను కండ్లముందే కూల్చివేస్తామంటూ మార్కింగ్ చేయడానికి వచ్చిన అధికారులను నిలదీసిన మధ్యతరగతి కుటుంబాల నిరసనగళమిది. డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామంటూ అధికారులు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా.. మేము ఉన్న గృహాలను గిట్లనే ఉంచండి తప్ప.. మాకు వేరే ఇళ్లే వద్దంటూ కుండబద్దలు కొట్టిన కాలనీవాసుల కచ్చితత్వమిది.

వివరాలియ్యం.. ఖాళీ చెయ్యం!

మార్కింగ్‌పై ఉద్రిక్తత

అధికారులకు తేల్చి చెప్పిన మూసీ నిర్వాసితులు

ఏకకాలంలో మూడు జిల్లాల్లో 26 బృందాల పర్యటన

అడుగడుగునా.. అడ్డుకున్న నిర్వాసితులు

2166 నిర్మాణాల గుర్తింపు.. వెల్లువెత్తిన ఆగ్రహావేశాలు

ప్రభుత్వానికి శాపనార్థాలు.. కన్నీటిపర్యంతం

నేడూ కొనసాగనున్న మార్కింగ్ సర్వే

అడుగడుగునా నిరసనలు.. అడ్డగింతలు.. వాగ్వాదాలు.. చావనైనా చస్తాం.. ఇల్లు వదలం.. వివరాలు ఇవ్వం.. ఇక్కడే ఉంటాం.. అంటూ.. నినాదాలు.. విషమిచ్చి చంపి తమ ఇండ్లను కూల్చివేయాలంటూ..ఆవేదనలు.. గురువారం మూసీ పరీవాహక ప్రాంతాల్లో సర్వే బృందాలకు నివాసితుల నుంచి ఎదురైన ప్రతి ఘటనలివి. తమ నివాసాలను కూల్చివేయడానికి బుల్డోజర్లు రాబోతున్నాయన్న వార్తతో వారం రోజుల నుంచి కంటి మీద కునుకు లేకుండా ఉన్న స్థానికులు.. బృందాలను అడ్డుకునే ప్రయత్నం చేయడం ఉద్రిక్తతకు దారితీసింది. మహిళల రోదనలు మిన్నంటాయి..సీఎం రేవంత్‌కు శాపనార్థాలు పెట్టారు. కొన్ని చోట్ల యజమానుల వివరాలు నమోదు చేసే పత్రాలను సైతం చించేశారు. ఓ యువకుడు మార్కింగ్ చేసేందుకు ఉపయోగించే ఎరుపు రంగును లాక్కొని దూరంగా విసిరేశాడు. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు ఏకకాలంలో సర్వే చేపట్టారు. 26 బృందాలు.. మూసీ వెంట ఉన్న అక్రమ నిర్మాణాలను గుర్తించి 'ఆర్‌బీక్స్' మార్క్ చేశాయి. తాజా సర్వేలో రివర్ బెడ్(నది గర్భం)లో 2,116, బఫర్ జోన్‌లో మరో 7,850 నిర్మాణాలు ఉన్నట్లు తేల్చాయి. కాగా, 'మీ ఇల్లు కూల్చేస్తాం. అందుకే ఈ మార్కింగ్..' అంటూ అధికారులు స్థానికులను భయభ్రాంతులకు గురి చేయడంలో తీవ్రవ్యతిరేకత వ్యక్తమైంది. బక్కపల్చని బతుకులను బజారుకీడ్చే సర్వే అంటూ మండిపడిన నిర్వాసితులు..రేవంత్ ఇంట్లో ఉంటామంటూ.. హెచ్చరించారు.

-సిటీబ్యూరో, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ)

మూసీ సర్వేలో భాగంగా హైదరాబాద్‌లో 16, రంగారెడ్డిలో 4, మేడ్చల్‌లో 5 బృందాలు మండలాల వారీగా పర్యటించాయి. మూసీ రివర్ బెడ్ ఏరియాలో ఉన్న నిర్మాణాలను అధికారులు గుర్తించి నివేదిక సిద్ధం చేశారు. హైదరాబాద్‌లో అంబర్‌పేట, ఆసిఫ్‌నగర్, బహదూర్‌పుర, చార్మినార్, గోల్కొండ, హిమాయత్‌నగర్, నాంపల్లి, సైదాబాద్ మండలాలు, మేడ్చల్‌లో ఘట్‌కేసర్, మేడిపల్లి, ఉప్పల్, రంగారెడ్డి జిల్లాలో అబ్దుల్లాపూర్‌మెంట్, గండిపేట, రాజేంద్రనగర్ మండలాల్లో కూల్చివేసే నిర్మాణాలను మార్క్ చేశారు. మూసీ నది వెంబడి రెవెన్యూ శాఖ నిర్వహించిన తాజా సర్వేలో రివర్ బెడ్(నది గర్భం)లో 2,116 నిర్మాణాలు, బఫర్ జోన్‌లో మరో 7,850 నిర్మాణాలు ఉన్నాయని గుర్తించారు. హైదరాబాద్‌లో అధికారులు అంచనా వేసుకున్న 1595 నిర్మాణాల్లో నిరసనల మధ్య 941 ఇండ్లకు మాత్రమే మార్క్ చేశారు. నేడూ కూడా సర్వే కొనసాగనున్నది.

అస్తవ్యస్తంగా సర్వే..

బాధితులకు సాంత్వన కలిగించేలా అధికారుల సర్వే ఉండాలి. కానీ సీఎం రేవంత్ పాలనలో బాధితులు భయభ్రాంతులకు గురయ్యేలా ' మీ ఇల్లు కూల్చేస్తాం. అందుకే ఈ మార్కింగ్.' అంటూ మూసీ ప్రాంతాల్లో సర్వే చేసిన అధికారులు స్థానికులను భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో నిర్వాసితులు అడుగడుగునా బృందాలను అడ్డుకోవడంతో సర్వే ఇష్టానుసారంగా సాగింది. ఒక్కో బృందం 75 ఇండ్లను సందర్శించాల్సి ఉండగా, ఉద్రిక్తల మధ్య సాధ్యం కాలేదు. యజమానుల వివరాలను కూడా సరిగా సేకరించలేకపోయారు. అధికారులు అడిగిన సమాచారాన్ని ఇంటి యజమానులు భయంతో ఇవ్వలేదు. తాము ఇక్కడి నుంచి వెళ్లే ప్రసక్తే లేదని అధికారులతో వాగ్వాదానికి దిగిన ఘటనలు ప్రతిచోటా కనిపించాయి. ఉప్పల్‌లో కేసీఆర్ నగర్, చైతన్యపురిలో సర్వే కోసం వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించినప్పటికీ ఎలాగైనా సర్వే చేయాలని ఆదేశాలు రావడంతో కొన్ని ఇండ్లకు మార్కింగ్ చేసి మమ అనిపించారు. యజమానులు చెప్పిన సమాచారం కాకుండా రెవెన్యూ రికార్డుల్లో ఉన్న సమాచారం మేర అధికారులే కూల్చేసే ఇండ్లను నోట్ చేసుకున్నారు.

గూడు.. గోడు

ఓ మహిళ ను అడ్డుకుంటున్న పోలీసులు



ఇప్పటికే మూసీ తీరానికి బుల్డోజర్లు..

ఇప్పటికే హైడ్రా బుల్డోజర్లు మూసీ తీరానికి చేరుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. శనివారం సాయంత్రానికి అంతా సిద్ధం చేసి ఆదివారం కూల్చివేయడానికి హైడ్రా ప్రణాళికలు చేసుకున్నది. అందుకు తగ్గట్టుగా బందోబస్తును కూడా రెడీ చేసుకుంది. ఎలాగైనా పెద్ద ఎత్తున వ్యతిరేకత ఉంటుందని ముందస్తుగానే హైడ్రా వద్ద సమాచారం ఉండటంతో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది. మూసీ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్ల సిబ్బంది ఆ ప్రాంతాల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. స్థానిక నాయకులతో చర్చిస్తూ..ఖాళీ చేయించడానికి ప్రయత్నిస్తున్నారు. మరోవైపు నది ఒడ్డున ఉన్న నివాసాల నుంచి ఖాళీ చేసే ప్రజలకు వసతి కల్పించడానికి ప్రభుత్వం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పునరావాసం కల్పిస్తామని చెప్పినప్పటికీ వాటిని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఖాళీ చేసే ప్రసక్తే లేదంటూ తేల్చి చెబుతున్నారు.

మూసీ తీరం వెంట గుర్తించిన అక్రమ నిర్మాణాలు

జిల్లా	మండలం	గుర్తించినవి
హైదరాబాద్	అంబర్‌పేట	64
	ఆసిఫ్‌నగర్	14
	బహదూర్‌పుర	527
	చార్మినార్	3
	గోల్కొండ	50
	హిమాయత్‌నగర్	263
	నాంపల్లి	604
	సైదాబాద్	70
మొత్తం		1595
మేడ్చల్	ఘట్‌కేసర్	2
	మేడిపల్లి	1
	ఉప్పల్	236
మొత్తం		239
రంగారెడ్డి	అబ్దుల్లాపూర్‌మెట్	
	గండిపేట	32
	రాజేంద్రనగర్	300
మొత్తం		332

మేము ఎలా బతకాలి..?

రూపాయి ... రూపాయి కష్టపడి కట్టుకున్న ఇంటిని కూలిస్తే మేము ఎలా బతకాలి. ప్రజలకు మంచిచేస్తున్న అనుకున్న ప్రభుత్వం ఇలా ఇష్టారాజ్యంగా పేదల ఇళ్లను కూల్చేందుకు సిద్ధం కావడం దారుణం. హైడ్రా పేరుతో చేస్తున్న ఆగడాలను వెంటనే ఆపాలి.

- లక్ష్మి, అత్తాపూర్ భరత్‌నగర్.

అడవుల్లో డబుల్ బెడ్రూం ఇస్తానంటే ఎలా?

తాము కష్టపడి కట్టుకొని ఇంటికి బదులుగా ఎక్కడో అడవుల్లో డబుల్ బెడ్రూం ఇస్తామంటే సరైన పద్ధతి కాదు. అధికారులు వస్తున్నారు. సర్వే పేరుతో ఇండ్లపై ఏదో రాస్తున్నారు..వెళ్తున్నారు. ఏది చేసినా చెల్లుతుందని అహంకార ధోరణితో అధికారులు వ్యవహరిస్తున్నారు.

-రాజశేఖర్, భరత్‌నగర్, అత్తాపూర్.

అన్నీ సరిగా ఉన్నా.. కూలగొడ్తమంటే ఎలా..

మేం ఇల్లు కట్టుకునేటప్పుడు అన్నీ సక్రమంగా చూసుకున్నం. సర్టిఫికెట్లన్నీ ఉన్నయ్. రిజిస్ట్రేషన్లు కూడా అయినయ్. ఈసర్వేనంబర్‌లో ఎలాంటి ఇబ్బంది లేదని గవర్నమెంట్ అధికారులే చెప్పారు. ఇప్పుడేమో కూలగొడ్తమని మార్కింగ్ చేస్తున్నారు. మేం ఓట్లేయకపోతే రేవంత్‌రెడ్డి గెలిచేటోడేనా. ఎప్పుడులేనిది ఇదేంది ఇప్పుడిట్ల చేస్తారు.

- చాదర్‌ఘాట్ వాసి

ఓట్లేసి తప్పచేసినం..

పైసాపైసా కూడబెట్టి మేం ఇండ్లు కొనుక్కున్నం. మూసీ అంటున్నారు. ఎవరెవరో వస్తున్నరు. మార్కింగ్ అంటున్నరు. అసలు ఏం చేస్తరో తెలుస్తలేదు. మా ఇల్లు కూలగొడ్తమంటే మాత్రం ఊరుకోం. అధికారులను అడిగితే కొన్ని ఇండ్లు పోతయని చెబుతున్నరు. ఇదెక్కడి న్యాయం. ప్రభుత్వం మాకేం న్యాయం చేస్తున్నది. ఇళ్లు ఇస్తామని చెబుతున్నరు కానీ ఉన్న ఇల్లు కూలగొడ్తే మేం మాత్రం ఆత్మహత్యలు చేసుకుంటం.

- చైతన్యపురి వాసి

హామీలపై నిలదీద్దాం.. అక్రమాలను ఎదిరిద్దాం

- ఇటీవల ప్రజాభవన్ ముట్టడికెళ్లి అరెస్టయిన నారేగూడెం రైతులతో ఎమ్మెల్యే సబితారెడ్డి మీటింగ్
- వారి సమస్యలు తెలుసుకుని అభయమిచ్చి..
- అనంతరం మాజీ మంత్రి కేటీఆర్‌తో గ్రామ రైతులతో ఫోన్‌లో మాట్లాడించిన మాజీ మంత్రి..
- పట్లూరుకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల అక్రమ అరెస్టుపై ఐజీతో ఫోన్‌లో మాట్లాడిన సబితారెడ్డి
- అలవికాని హామీలిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్
- రుణమాఫీ విషయంలో పూటకోమాట మాట్లాడుతున్నదని మండిపాటు

నవాబుపేట/మర్పల్లి, సెప్టెంబర్ 26 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయని సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు వెంటనే క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి డిమాండ్ చేశారు. వారం రోజుల కిందట ప్రజాభవన్ ముట్టడికెళ్లి అరెస్టైన నవాబుపేట మండలంలోని నారేగూడెం గ్రామ రైతులతో సబితారెడ్డి గురువారం మాట్లాడారు. వారి కష్టాలు తెలుసుకున్నారు. గ్రామంలో 300 మందికి పైగా రుణమాఫీ కాలేదని అన్నదాతలు తెలిపారు. బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ పనులు మానుకొని తిరిగినా లాభం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన ఆమె రుణమాఫీపై బ్యాంకు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులు పాసుపుస్తకాలను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి అప్పు తెచ్చుకున్నారు. సరైన పత్రాలున్నా రుణం ఎందుకు మాఫీ కాలేదని బ్యాంకు సిబ్బందిని నిలదీశారు. గత కేసీఆర్ హయాంలో రైతుబంధు, పీఎం కిసాన్ యోజన డబ్బులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. వాటికి లేని అడ్డంకులు రుణమాఫీకే ఎందుకు వస్తున్నాయో స్పష్టం చేయాలన్నారు.

పూటకో మాట..

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సబితారెడ్డి మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి పూటకోమాట మాట్లాడుతూ రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రుణమాఫీ చేయడం చేతగాకపోతే స్పష్టంగా చెప్పాలని..అంతేగాని ఇలా అన్నదాతలతో ఆటలాడటం సరైన పద్ధతి కాదన్నారు. వారి ఉసురు తగులుతుందన్నారు. ఏ జిల్లాకెళ్తే ఆ జిల్లాలో ఉన్న ఆలయాలపై ఒట్టేసి రుణమాఫీ చేస్తానని మాటిచ్చి మోసం చేసిన రేవంత్‌కు రానున్న రోజుల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. అనంతరం సబితారెడ్డి కేటీఆర్‌తో గ్రామ రైతులతో ఫోన్‌లో మాట్లాడించ గా.. అధైర్యపడకండి..మీ తరపున పోరాడుతానని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, యెల్లకొండ పార్వతీపరమేశుల ఆలయ చైర్మన్ పట్లోళ్ల భరత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దయాకర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు మాణిక్‌రెడ్డి, విజయ్, శాంతికుమార్, రమేశ్‌రెడ్డి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పట్లూర్‌లో బాధితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రిసబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వేధింపులు మానుకోవాలి

మర్పల్లి మండలంలోని పట్లూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు(దళితులు) ప్రవీణ్, నవీన్‌లను ఓ కేసు విషయంలో మర్పల్లి పోలీసులు అరెస్టు చేసి కొట్టిన విషయం తెలుసుకొని ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ వారి ఇండ్లకెళ్లి పరామర్శించారు. వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ఘటనపై ఐజీతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. పోలీసులు ఎవరిపైనా అనవసరంగా కేసులు పెట్టకుండా, వేధించకుండా చూడాలన్నారు. వివరాలు తెలుసుకుని బాధ్యులను శిక్షించాలన్నారు. ఇటీవల మండలంలోని మూడు, నాలుగు గ్రామాల్లో జరిగిన ఘటనలను ఐజీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. పట్లూరు గ్రామంలో జరిగిన గుర్తు తెలియని మృతదేహంపై ఆరా తీసిన తర్వాతే దోషులెవరో నిర్ధారించాలని ఎస్పీ, ఐజీకి సూచించారు. పోలీసులు ఇబ్బందులు పెడుతున్నారని లొంగిపోకుండా పద్ధతిగా ఉండాలని కార్యకర్తలకు హితబోధ చేశారు. న్యాయం మన పక్షాన ఉంటే ఎంతపరకైనా కొట్లాడుదామని.. ప్రతి కార్యకర్తకూ బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ నిలదీద్దాం.. అక్రమాలను ఎదిరిద్దామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మధుకర్, మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి రాచయ్య, యూత్ అధ్యక్షుడు మధుకర్, నాయకులు నాయబ్‌గౌడ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అధికారం శాశ్వతం కాదు..

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. అధికారం, ఒక పార్టీ ప్రభుత్వం శాశ్వతంగా ఉండదన్న విషయాన్ని పోలీసులు గుర్తుంచుకోవాలన్నారు. ఎవరో ఒక్కరు తప్పు చేసి వ్యవస్థకు మచ్చ తీసుకురావొద్దని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు.